నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 31 జనవరి 2024 | KAMAREDDY

పాస్‌పోర్టుల స్కాంలో ఎస్‌బీ పాత్ర


సీఐడీ విచారణలో వెలుగులోకి..
స్పెషల్‌బ్రాంచ్ ఏఎస్సైకి బిగుసుకున్న ఉచ్చు
లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకున్న ప్రత్యేక బృందం
ఫేక్ సర్టిఫికెట్ల కేసులో లోతుగా దర్యాప్తు
ఎవరెవరి పాత్ర ఎంతనే దానిపై ఆరా

# నకిలీలో స్పెషల్

వినాయక నగర్, జనవరి 30: నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి పాస్‌పోర్టులు ఇప్పించిన కేసులో సీఐడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కుంభకోణంలో ఇప్పటికే పలువురిని అరెస్టు చేసిన దర్యాప్తు సంస్థ.. ఇందులో స్పెషల్‌బ్రాంచ్ (ఎస్‌బీ) విభాగం పాత్ర కూడా ఉన్నదని తేల్చింది. ఈ క్రమంలోనే నిజామాబాద్ ఎస్‌బీ ఏఎస్సై లక్ష్మణ్‌ను తాజాగా అదుపులోకి తీసుకున్నది. మంగళవారం తెల్లవారుజామున గంగాస్థాన్ ఫేజ్-2లోని నివాసంపై దాడి చేసి, ఆయనను నగరంలోని సీఐడీ కార్యాలయానికి తరలించారు. మధ్యాహ్నం అక్కడ విచారించిన అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. తాజా ఘటనతో స్పెషల్‌బ్రాంచ్ విభాగం పనితీరు మరోమారు చర్చనీయాంశంగా మారింది. గతంలోనూ అనేక ఉదంతాల్లో ఎస్‌బీ వ్యవహార శైలిపై లెక్కకు మించి ఆరోపణలు ఉన్నాయి. మూడేండ్ల క్రితం బోధన్‌లో వెలుగుచూసిన పాస్‌పోర్టు కేసుల ఉదంతంలోనూ స్పెషల్ బ్రాంచ్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఆ కేసులోనూ ఓ ఏఎస్సై పాత్ర ఉన్నట్లు తేలడంతో సస్పెండ్ చేయడం అప్పట్లో కలకలం రేపింది. తాజాగా మరో ఏఎస్సై కూడా ఉచ్చులో చిక్కుకోవడం చర్చనీయాంశమైంది.


లక్ష్మణ్ (ఫైల్)



## తెల్లవారక ముందే దాడి..

ఏజెంట్ సుభాష్ ఇచ్చిన సమాచారంతో సీఐడీ ప్రత్యేక బృందం మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలోనే రంగంలోకి దిగింది. నగరంలోని గంగాస్థాన్ ఫేస్-2 లో నివాసముండే ఎస్‌బీ ఏఎస్సై లక్ష్మణ్ ఇంటి పై దాడి చేసింది. అంతకు ముందే ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులకు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారమిచ్చారు. లక్ష్మణ్‌ను నగరంలోని సీఐడీ కార్యాలయానికి తరలించి, మధ్యాహ్నం వరకు విచారించారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. గతంలో ధర్పల్లి, సిరికొండలో ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసిన లక్ష్మణ్.. ప్రస్తుతం ఏఎస్సైగా మాక్లూర్, నవీపేట్ స్టేషన్ల పరిధిలో ఎస్‌బీ బాధ్యతలు చూస్తున్నాడు. అయితే, ఏజెంట్ సుభాష్‌తో లక్ష్మణ్‌కు ఎలా పరిచయం ఏర్పడింది. ఫేక్ సర్టిఫికెట్ల రూపకల్పనలో ఎవరు సహకరించారనే కోణంలో అధికారులు విచారిస్తున్నట్లు తెలిసింది. ఇందులో ఇంకా ఎవరెవరి పాత్ర ఉందనే దానిపైనా ఆరా తీస్తున్నట్లు సమాచారం.

## తీగ లాగితే కదిలిన డొంక..

ఫేక్ సర్టిఫికెట్లు సృష్టించి పాస్‌పోర్టులు ఇప్పిస్తున్న విషయం బయటకు రావడంతో సీఐడీ సీరియస్‌గా రంగంలోకి దిగింది. నిజామాబాద్ సహా పలు జిల్లాల్లో కొంత మంది ఏజెంట్లను అరెస్టు చేసి విచారణ చేపట్టింది. సీఐడీ ఏడీజీ శిఖాగోయెల్ పర్యవేక్షణలో అధికారులు పక్కాగా సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఈ ఫేక్ స్కాంలో ఎంత మంది ఉన్నారు.. వారికి ఎవరెవరు సహకరించారు.. ప్రభుత్వ విభాగాల నుంచి సహకరించింది ఎవరనే దానిపై కూపీ లాగుతున్నారు. ఈ నెల 19న భీమ్‌గల్‌లో అరెస్టు చేసిన ఏజెంట్ సుభాష్‌ను విచారించి కీలక సమాచారం సేకరించినట్లు తెలిసింది. దీనికితోడు వివిధ జిల్లాల్లో అరెస్టు చేసిన నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఫేక్ స్కాంలో స్పెషల్‌బ్రాంచ్ సిబ్బందికి పాత్ర ఉన్నట్లు వెల్లడైంది.

## పరిశీలన నామమాత్రమే..

పోలీసు శాఖలో స్పెషల్‌బ్రాంచ్‌ది అత్యంత ప్రాధాన్యత కలిగిన విభాగం. పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్న వారి గురించి ఆరా తీయడం, వారిపై ఏవైనా కేసులు ఉన్నాయా.. నేరపూరిత చరిత్ర ఉందా.. అప్లికేషన్‌తో పాటు సమర్పించిన డాక్యుమెంట్లు ఒరిజినల్స్ క్షుణ్ణంగా పరిశీలించడం ఎస్‌బీ బాధ్యత. స్పెషల్‌బ్రాంచ్ క్లియరెన్స్ ఇస్తేనే పాస్‌పోర్టు మంజూరవుతుంది. అంతటి కీలక బాధ్యతలో ఉన్న స్పెషల్‌బ్రాంచ్ సిబ్బంది కొందరు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. డాక్యుమెంట్లు పరిశీలించకుండా, ఎలాంటి విచారణ లేకుండానే దరఖాస్తుదారుల నుంచి డబ్బులు తీసుకుని క్లియరెన్స్ ఇచ్చేస్తుండడం గమనార్హం. అందువల్లే బోధన్ వంటి ఉదంతాలు, తాజా ఫేక్ పాస్‌పోర్టు వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి.



# జిల్లాలో నలుగురు సీఐలకు స్థానచలనం

వినాయక నగర్, జనవరి 30: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు మల్టీజోన్ ఐజీ డాక్టర్‌తరుణ్ జోషి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐగా ఉన్న వెంకట నారాయణను నిజామాబాద్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు.సిద్దిపేట కమిషనరేట్‌లో సీఐగా కొనసాగుతున్న బి.భిక్షపతిని నిజామాబాద్ జిల్లా ధర్పల్లి సీఐగా నియమించగా.. ధర్పల్లి సీఐ పి.సురేందర్‌ను నిజామాబాద్ సీసీఎస్‌కు బదిలీ చేశారు. మల్టీ జోన్-1 ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న ఎన్.సురేశ్‌కుమార్ నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐగా నియమితులయ్యారు.


సమావేశంలో మాట్లాడుతున్న కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

# పకడ్బందీగా ఇంటర్ పరీక్షల నిర్వహణ

కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, జనవరి 30: జిల్లాలో ఫిబ్రవరి ఒకటి నుంచి 15వ వరకు మూడు దఫాల్లో జరిగే ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖ అధికారులతో మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహిస్తారని తెలిపారు. ఇందుకు సంబంధించి అందజేసిన మార్గదర్శకాల మేరకు పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు గంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. థియరీ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 14 వరకు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు కామారెడ్డి, బిచ్కుంద, బాన్సువాడలోని 50 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిబంధనల మేరకు ఓఎంఆర్ షీట్ విద్యార్థులకు అందజేస్తూ హాజరు రికార్డు చేయాలని సూచించారు. మాల్ ప్రాక్టీస్, మానవ తప్పిదాలు జరగకుండా చూడాలన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నాని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, పరీక్షా కేంద్రాల చుట్టూ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇంటర్మీడియేట్ నోడల్ అధికారి షేక్ సలాం, ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు శ్రీనాథ్, నాగేశ్వరయ్య, చీఫ్ సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

# వీడీసీ సభ్యుల బైండోవర్

డిచ్‌పల్లి, జనవరి 30: మండలంలోని కోరట్‌పల్లి, ధర్పల్లి మండలం మైలారం గ్రామాలకు చెందిన వీడీసీ సభ్యులను మంగళవారం తహసీల్దార్ రాజేందర్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. రెండు గ్రామాల వీడీసీ సభ్యులు గొడవ పడుతుండడంతో బైండోవర్ చేశామని, రూ. 2లక్షల పూచీకత్తుపై వదిలేసినట్లు చెప్పారు.

## సీఐ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్

రెండు గ్రామాల వీడీసీ సభ్యులకు డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ కౌన్సిలింగ్ ఇచ్చారు. వీడీసీ అనేది చట్టబద్ధమైన వ్యవస్థ కాదని, వీడీసీ సభ్యులుగా లేక వీడీసీ పేరుతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలుగజేసినా, భయభ్రాంతులకు గురిచేసినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీడీసీ ఆగడాలపై బాధితులు, ప్రజలు నిర్భయంగా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# పసుపు ధర తగ్గకుండా చూడాలి

రైతులకు నష్టం రాకుండా చర్యలు చేపట్టాలి
అధికారులకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆదేశం
కలెక్టరేట్‌లో పసుపు విక్రయాలపై సమావేశం


మాట్లాడుతున్న నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, జనవరి 30 : పసుపు కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మద్దతు ధర చెల్లిస్తూ పంటను సేకరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు విక్రయాలు ఊపందుకుంటున్న నేపథ్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌లో వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, ట్రేడర్లు, కమిషన్ ఏజెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. పసు పు పంటకు ప్రస్తుతం మార్కెట్లో పలుకుతున్న ధర, పంట దిగుబడి, నాణ్యత తదితర వివరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పసుపు క్వింటాలుకు నాణ్యతను బట్టి రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ధర లభిస్తోందని రైతు ప్రతి నిధులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మార్కెట్‌కు పంట దిగుబడి ఎక్కువగా వస్తున్నందున ధర తగ్గే అవకాశం ఉందని, రైతులు నష్టపోకుండా ధర నిలకడగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసిన రైతు ఎట్టి పరిస్థితిల్లోనూ నష్టపోరాదని కలెక్టర్ సూచించారు. సాగు విస్తీర్ణం తగ్గడంతో ప్రస్తుతం పసుపు పంటకు ఆశించిన రీతిలోనే మంచి డిమాండ్ ఉందని తెలిపారు. పసుపు క్రయవిక్రయాల సీజన్ కొనసాగుతున్నదని, క్రమం తప్పకుండా మార్కెట్ యార్డును సందర్శిస్తూ నేరుగా రైతులతో భేటీకావాలని మార్కెటింగ్, ఉద్యానవన,వ్యవసాయ శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఒకే నాణ్యతలో కూడిన పంటలకు ట్రేడర్లు చెల్లించే ధరలో వ్యత్యాసం ఉండకుండా చూడాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, ఆర్డీవో రాజేంద్ర కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, మార్కెటింగ్ ఏడీ గంగామణి, ఉద్యానవన శాఖ అధికారి నర్సింగ్ దాస్, రైతు సంఘాల ప్రతినిధులు అన్వేష్ రెడ్డి, వి.ప్రభాకర్, దేవరాం పాల్గొన్నారు.


ఆర్మూర్‌లో చేపట్టిన దీక్షలో కూర్చున్న మైనార్టీ కౌన్సిలర్లు

# కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గినా..పట్టించుకోవడం లేదు
కౌన్సిలర్లు, మైనార్టీ నాయకుల ఆగ్రహం

ఆర్మూర్‌టౌన్,జనవరి 30: ఆర్మూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నాకు ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేస్తూ మైనార్టీ కౌన్సిలర్లు, యువకులు, మహిళలు నిరాహార దీక్ష చేపట్టారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద చేపట్టిన ఈ దీక్షలు మంగళవారం మూడోరోజుకు చేరుకోగా ఈ సందర్భంగా మైనార్టీ కౌన్సిలర్లు మాట్లాడారు. ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గి 26 రోజులు కావస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చు కోవాలని , వైస్ చైర్మన్ మున్నా కు ఇన్‌చార్జి చైర్మన్ బాధ్యతలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.


ఎల్లారెడ్డి క్యాంప్ కార్యాలయ భవనం

# క్యాంప్ ఆఫీస్‌కు వాస్తు దోషమట!

ఎల్లారెడ్డి, జనవరి 30: ఎమ్మెల్యేలు అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గ కేంద్రంలో క్యాంపు కార్యాలయాలను ఏర్పాటు చేసింది. అన్ని హంగులతో నూతన భవనాలు నిర్మించగా.. ఎన్నికల వరకు సందడిగా ఉండేవి. నిత్యం వచ్చే ప్రజలతో కార్యాలయాలు కళకళలాడేవి. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాగా కొన్నిచోట్ల వాస్తు దోషం పేరిట క్యాంపు ఆఫీసులను ఇప్పటివరకు తెరవకపోవడం గమనార్హం. ఇందులో భాగంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కూడా మూసి ఉండగా.. ఏదైనా పని నిమిత్తం వెళ్లినవారికి గేటుకు వేసిన తాళం దర్శనమిస్తోంది. ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా జాజాల సురేందర్ ఉన్నప్పుడు క్యాంపు కార్యాలయంలోనే అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రస్తుత ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఇప్పటివరకు క్యాంపు కార్యాలయం వైపు చూడకపోవడం గమనార్హం. రోడ్డుకు ఎత్తులో ఉండాల్సిన భవనం కిందికి ఉందని, ఇది పూర్తిగా వాస్తుకు పనికి రాదని వాస్తు పండితులు చెప్పడంతో తన నివాసంలోనే క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. నిజామాబాద్ రూరల్ క్యాంప్ ఆఫీస్ కూడా వాస్తు ప్రకారం లేదంటూ ఇప్పటి వరకు దానిని కూడా తెరవకపోవడం గమనార్హం.



# పదిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం
పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్న విద్యాశాఖ
ఉదయం, సాయంత్రం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి

**సర్కారు బడుల్లో** పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. ఉత్తీర్ణత పెంచడానికి ఉపాధాయ్యులు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ వారిని వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. పలు చోట్ల ఉపాధ్యాయుల కొరత ఉండగా, ఇతర పాఠశాలల నుంచి సర్దుబాటు చేసి విద్యాబోధన సాగేలా అధికారులు చర్యలు చేపట్టారు.

– వేల్పూర్, జనవరి 30



**ప్రభుత్వ** పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో రోజూ ఉదయం, సాయం త్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించడమేగాక విద్యార్థుల్లో మనోబలాన్ని నింపుతూ ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఇప్పటికే విద్యార్థులకు అభ్యాస దీపిక పుస్తకాలను అందజేశారు. దాదాపు సిలబస్ పూర్తి కాగా, ముఖ్యమైన సబ్జెక్టులపై విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. గతంలో కన్నా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులతో పాటు సంబంధిత విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానోపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయులు సైతం పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతిరోజూ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ వివిధ సబ్జెక్టులపై సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ప్రతి పాఠశాలలో కూడా 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. కాగా ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షలకు బాలురు 11,129, బాలికలు 10,612 మంది హాజరుకానున్నారు.

## వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. పదో తరగతి విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజుకో సబ్జెక్టు ఉపాధ్యాయుడు ప్రత్యేక తరగతులను తీసుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 100శాతం మెరుగైన ఫలితాలను సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులకు రోజువారీ టెస్టులను నిర్వహిస్తున్నారు. సిలబస్ పూర్తి కావడంతో ప్రత్యేక తరగతులపై ఉపాధ్యాయులు దృష్టి సారించారు. ప్రభుత్వం మార్చిలో ఫైనల్ పరీక్షలు నిర్వహించనుండడంతో విద్యార్థులను ఆ దిశగా సన్నద్ధం చేస్తున్నారు.

### వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతనే లక్ష్యంగా ముందుకు కొనసాగుతున్నాం. సిలబస్ ప్రకారం బోధన చేపట్టి ఫలితాలు సాధించడానికి పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. వందశాతం ఫలితాలు, ఉత్తమ జీపీఏ సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. విద్యార్థులపై తల్లిదండ్రులు సైతం దృష్టి సారించాలి.

- సురేశ్, ప్రధానోపాధ్యాయుడు, అమ్రాద్ గ్రామం, మాక్లూర్ మండలం

### ప్రణాళికాబద్ధంగా ముందుకు..



గతంలో కన్నా మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాం. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. ప్రత్యేక తరగతుల నిర్వహణతో విద్యార్థులకు ఎంతో ఉపయోగం. ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్సెస్సీలో ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తున్నాం.

- గంట అశోక్, ఉపాధ్యాయుడు, చింతలూర్

### పాఠాలు చక్కగా బోధిస్తున్నారు..



సబ్జెక్టుల్లో వస్తున్న సందేహాలను ఎప్పటికప్పుడు ప్రత్యేక తరగతుల్లో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటున్నాం. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తా. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రతి సబ్జెక్టుపై అవగాహన పెరుగుతుంది. పరీక్షల్లో మంచి మార్కులు సాధించే లక్ష్యంగా ముందుకు కొనసాగుతున్నా. సబ్జెక్టులలో అర్థం కానివి ఉంటే ప్రత్యేక తరగతులలో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటున్నాం.

- సింధూజ, విద్యార్థిని, చింతలూర్ గ్రామం